క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

రామభద్రపురం: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ వి.ప్రసాదరావు ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. అతివేగం, నిర్లక్ష్యం, పరిమితికి మించి ప్రయాణికులు, లోడు ఎక్కించడం, మద్యం తాగి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు డ్రైవ్ చేయడం లాంటి కారణాల వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐ కె.నారాయణరావు తెలిపారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా అనుసరించాలని, వాహన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. అనంతరం వాహన తనిఖీలు నిర్వహించి, ట్రిపుల్ రైడింగ్, వాహన పత్రాలు లేని పలు వాహనాలను గుర్తించి, స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న మొగిలివలస గ్రామస్తులు

రాజాం: మండలంలోని మొగిలివలస వద్ద ప్రధాన రోడ్డులోని బస్‌స్టాప్ వద్ద ఆ గ్రామ యువత ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం గురువారం ఏర్పాటు చేశారు. పూజిత స్మారక చలివేంద్రం పేరిట ప్రయాణికులకు ఈ సేవలు అందిస్తున్నట్లు యువకులు తెలిపారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తి తీరేలా ఈ సేవ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎం.హరి, ఎల్.అప్పలనాయుడు, ఎల్.కుమార్ నాయుడు, కె.గోవిందు, కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

రాజాం: స్థానిక మాదిగ వీధిలో రూ.3.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు గురువారం నిర్మించారు. మున్సిపాల్టీలోని 15వ ఆర్థిక సంఘ నిధులతో ఈ రోడ్డు, మురుగుకాలువలు నిర్మించామని ఏఈ వెంకట్ తెలిపారు. 300 మీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణం చేశామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించామన్నారు.

కళ్లద్దాల పంపిణీ

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దృష్టిలోపంతో బాధపడుతున్న 15 మంది విద్యార్థులకు కళ్లద్దాలు గురువారం పంపిణీ చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గతంలో విద్యార్థులకు నిర్వహించిన నేత్ర వైద్య పరీక్షల్లో వివిధ కంటి సమస్యలతో బాధపడుతూ అంతగా కనిపించని విద్యార్థులకు వీటిని ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ చేతులమీదుగా అందజేశారు.

పరీక్ష కిట్లు పంపిణీ

రాజాం సిటీ: మండల పరిధిలోని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురవాం కేజీబీవీ విద్యార్థులకు రాజాంకు చెందిన వాసవీక్లబ్ మనరాజాం–సారథి సభ్యులు గురువారం పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. 195 మంది విద్యార్థులకు అట్టతో పాటు పెన్నులు, జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలు బాగా రాసి, మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యారావు, వాసవీక్లబ్ సభ్యులు గ్రంధి రవి, వాకచర్ల రాజా, గ్రంధి కామేష్, వాకచర్ల అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట, చాటాయవలస, ఉప్పరనాయుడువలస తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంటకాలు చేశారా లేదా ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు.

నిషేధిత పాలిథిన్ సంచులు వాడొద్దు



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచులు వాడొద్దని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో గురువారం సమావేశమైన ఆయన.. కలెక్టర్ ఆదేశాల మేరకు పాన్‌షాపులు, కిరాణా దుకాణాలు, టీ కొట్లలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ప్రతీ పంచాయతీని సారా రహిత గ్రామంగా, నిషేధిత పాలిథిన్ వాడకం లేని గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం ప్రతిఒక్కరూ వినియోగించుకునేలా చూడాలన్నారు.

క్వార్టర్స్ ఏవీ?



- రక్షకభటులకు అందుబాటులో లేని క్వార్టర్స్
- రేగిడి, వంగర మండలాల్లో కానరాని పోలీస్ భవనాలు
- సంతకవిటిలో శిథిలావస్థలో నిర్మాణం
- రాజాంలోని క్వార్టర్స్ కూల్చేసి, వదిలేసిన అధికారులు
- సిబ్బందికి తప్పని ఇబ్బందులు



రాజాంలో పోలీస్ క్వార్టర్స్ నిర్మించాల్సిన ఖాళీ స్థలం, (ఇన్‌సెట్లో) సంతకవిటిలో శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్స్

రాజాం: శాంతిభద్రతల పరిరక్షణకు రక్షణ కవచంలా పనిచేసే పోలీసులకు క్వార్టర్స్ కరువయ్యాయి. దీంతో ఏళ్ల తరబడి అద్దె ఇళ్లల్లోనే గడపాల్సిన పరిస్థితి. స్థలాలు ఉన్నా క్వార్టర్స్ నిర్మించకపోవడంతో పోలీసులకు అవస్థలు తప్పడం లేదు. వంగర, సంతకవిటి మండలాల్లో పోలీస్ క్వార్టర్స్ అస్సలు లేవు. సంతకవిటిలోని ఉన్న క్వార్టర్స్ భవనాలైతే ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. రాజాంలో గతంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను ఏడేళ్ల క్రితం తొలగించి అలానే వదిలేశారు. వాటి స్థానంలో ఎటువంటి కొత్త భవనాలు నిర్మించకపోవడంతో ఆ ప్రాంతమంతా ఖాళీగా ఉంది. రాజాం పట్టణంలో 35 మంది, రాజాం రూరల్ పరిధిలోని వంగర మండలంలో 16, రేగిడిలో 20, సంతకవిటి మండలంలో 20 మంది పోలీసులు సేవలందిస్తున్నారు. వీరంతా ప్రస్తుతం అద్దె ఇళ్లల్లో నివాసం ఉండి, విధులకు హాజరవుతున్నారు.

కొత్త భవనాల ఊసే లేదు..

రాజాంలో ప్రధాన రహదారి పక్కనే బొబ్బిలి జంక్షన్ సమీపంలో రెండున్నర ఎకరాల ఖాళీ స్థలం పోలీస్ శాఖ ఆధీనంలో ఉంది. అక్కడ పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి గతంలో పరిశీలనలు జరిగినా ఫలితం లేదు. ఇటీవల కాలంలో కొత్త భవనాల నిర్మాణం గూర్చి ఊసే లేదు. ఇదిలా ఉంటే సంతకవిటిలో శిథిలమైన క్వార్టర్స్ స్థానంలో కొత్తవి నిర్మించాల్సి ఉంది. రేగిడి, వంగర మండలాల్లో కొత్తగా స్థలాలు గుర్తించి, క్వార్టర్స్ నిర్మాణానికి పరిశీలనలు జరిగాయి. అయినా భవన నిర్మాణాలు చేయడం లేదు.

అద్దె భారం..

రాజాం పట్టణంలో ఇంటి అద్దెలు బాగా పెరిగాయి. పట్టణంలో ఏ వార్డులో ఇల్లు కావాలన్నా రూ.2,500 కనీస అద్దె నుంచి రూ.6 వేల వరకు చెల్లించాలి. రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో అయితే అద్దెకు అసలు ఇళ్లు లభించే పరిస్థితి లేదు. దీంతో అక్కడ పనిచేసే పోలీసులంతా రాజాం వచ్చి మరీ అద్దె ఇంట్లో ఉండాల్సి వస్తోంది. అద్దె ఇళ్లల్లో కుటుంబాలు, స్టేషన్‌లో 24 గంటల పాటు విధులు, పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లి, తీసుకురాలేని పరిస్థితులు.. ఇవన్నీ పోలీసులు పడుతున్న బాధలు. ఓ వైపు అద్దె భారం భరిస్తూ కుటుంబాన్ని సరిగా చూసుకోలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే క్వార్టర్స్ ఉంటే తాము ఎక్కడున్నా తమ కుటుంబ రక్షణ గూర్చి ఆలోచన చేయాల్సిన పరిస్థితి ఉండదని, అందరి కుటుంబాలు అక్కడే ఉంటాయి కనుక ధైర్యంగా విధులు నిర్వహించుకోవచ్చని అంటున్నారు.

నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం..

పోలీస్ క్వార్టర్స్ అవసరమైన చోట నిర్మాణాల కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపాం. సంతకవిటి క్వార్టర్స్ పూర్తిగా పనికిరాదు. ఆ స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలి. వంగర మండలంలో స్థలం గుర్తించి, ఉన్నతాధికారుల వద్దకు ఫైల్ వెళ్లింది. జిల్లాల విభజన కారణంగా అక్కడ క్వార్టర్స్ నిర్మాణం మంజూరు కాలేదు. రేగిడిలో స్థల పరిశీలన పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ మూడు మండలాల్లో క్వార్టర్స్ నిర్మాణంపై ఉన్నతాధికారులు దృష్టిసారించారు.

– హెచ్.ఉపేంద్ర, రాజాం రూరల్ సీఐ

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

- మండల ప్రత్యేకాధికారి వి.టి.రామారావు



అధికారులకు సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రామారావు

తెర్లాం: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు మండల స్థాయి అధికారులంతా కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.టి.రామారావు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈ సంతోష్ కుమార్‌కు సూచించారు. ప్రజల దాహార్తి తీర్చేలా అన్ని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రాంబాబుకు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ శనివారం మండలాన్ని ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నియంత్రించేలా వ్యాపారులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపీడీవో రాంబాబులకు తెలిపారు. మండలంలో జరుగుతున్న పీ–4 సర్వేను రెండు రోజుల్లో శతశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో మూగజీవాలకు తాగునీటి సౌకర్యం కల్పించేలా ఉపాధి హామీ పథకం అధికారులు, పశు సంవర్థక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రశాంత్‌కుమార్

రామభద్రపురం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి జి.ప్రశాంత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న క్రాస్‌ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో పాడైన చేతి పంపులు, మంచినీటి పథకాలను బాగు చేయడంతో పాటు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యపై ప్రతీ మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫిర్యాదు కోసం గ్రీవెన్స్ రిజిస్టర్ నిర్వహిస్తున్నామని, ఆ రిజిస్టర్‌లో తాగునీటి సమస్య ఉన్న గ్రామం నుంచి ఎవరైనా వచ్చి, ఫిర్యాదు రాసి వెళ్లవచ్చన్నారు. సంబధిత అధికారులు వచ్చిన వెంటనే ఆ రిజిస్టర్ చూసి ఫిర్యాదు వచ్చిన గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తారన్నారు. అలాగే పీ–4 సర్వే వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రత్నం, ఈవోపీఆర్డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ భవ్య రెడ్డి

మెంటాడ: మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని బొబ్బిలి డీఎస్పీ భవ్య రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని పనసలవలస గ్రామంలో ఆంధ్ర పోలీసులు, జన విజ్ఞాన వేదికల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆధునిక కాలంలో కూడా మూఢ నమ్మకాలు ఆచరించి, చాలామంది గిరిజనులు తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా ఆపదలో ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 100ను, ఆరోగ్య సమస్యతో బాధపడే వారు ఆస్పత్రికి వెళ్లాలంటే టోల్‌ఫ్రీ నంబర్ 108ను సంప్రదించి, సమాచారం ఇవ్వాలన్నారు. కొన్నిచోట్ల పాము కరిస్తే నాటువైద్యం ఆశ్రయిస్తున్నారని, అలా చేయవద్దని వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో గజపతినగరం సీఐ జీఏవీ రమణ, జేవీవీ జాతీయ నాయకులు గండ్రేటి లక్ష్మణరావు, ఎస్ఐ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ప్రజలు ఇక్కట్లు

బొబ్బిలి: పట్టణంలో తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రజలకు మానేసి, కాంక్రీటు పనుల కోసం నీరివ్వడం అవసరమా అని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ ప్రశ్నించారు. స్థానిక పట్టణంలో కాంక్రీటు పనుల కోసం నీరు సరఫరాకు వినియోగించే ట్యాంకరును చూపిస్తూ ఆయన గురువారం మాట్లాడారు. వేసవిలో తాగునీటి అవస్థలు పడే ప్రాంతాలు చాలా ఉంటాయని, వాటికి నీరు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలే కానీ డబ్బుల కోసం ఇలా నీటిని అమ్మడమేంటని ధ్వజమెత్తారు.

పీ-4 సర్వేను వేగవంతం చేయండి

బొబ్బిలిరూరల్: మండలంలోని శివడవలస, కమ్మవలస, కొండదేవుపల్లి, పిరిడి గ్రామాల్లో ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేస్తున్న పీ–4 సర్వేను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనవసరంగా ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయొద్దన్నారు. కాలువల్లో మురుగును తొలగించాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట ఏవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్య రెడ్డి

బాడంగి: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని బొబ్బిలి డీఎస్పీ భవ్య రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక ఎత్తు ఖానా వద్ద దీక్ష మహిళా సంక్షేమ సంఘ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె.. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తుండడం అభినందనీయమన్నారు. మహిళలను పురుషులతో సమానంగా చూడాలని, మహిళలపై వివక్ష వద్దని, వారిని చిన్నచూపు చూడొద్దని కోరారు. మహిళలను ప్రోత్సహిస్తే వారు తమకు ఇష్టమైన రంగంలో మరింత రాణిస్తారన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం టి.నాగార్జున సీఈవో శాంతి, ఏవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు



వంగర: మద్దివలసలో సాగునీటి చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. గ్రామగ్రామాన చేపడుతున్న పనుల్లో కొన్నిచోట్ల సాగునీటి చెరువులు, కాలువలు బాగు చేస్తుండగా, మరికొన్నిచోట్ల జీడిమామిడి తోటల్లో ఫారంపాండ్‌ల నిర్మాణం, కందకాల తవ్వకాలు చేస్తున్నారు. ఆయా పనులను పరిశీలించే ఏపీవోలంతా వేతనదారులకు పలు సూచనలు చేస్తున్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని, వడదెబ్బ బారినపడకుండా వాతావరణం చల్లగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

– వంగర, రాజాం, రేగిడి



రాజాం: సోపేరులో ఫారంపాండ్‌ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏపీవో హరనాథరావు



రేగిడి: నాయరాళ్లవలసలో జీడిమామిడి తోటలో కందకాల తవ్వకాలు

భక్తజన జాతర



సంతకవిటి మండలం, మామిడిపల్లిలో కొత్తగా నిర్మించిన కనకదుర్గ ఆలయ ప్రారంభోత్సవం భక్తజన జాతరను తలపిస్తోంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు అయిన గురువారం గ్రామ ప్రదక్షిణ, రథోరోహణ, అశ్వారోహణ, గోసహిత ప్రజారోహణ చేపట్టారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆయా కార్యక్రమాల్లో పాల్గొని, అమ్మవారికి విశేష పూజలు చేశారు.

నిర్మానుష్యం





వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచేస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మధ్యాహ్నం 12 గంటలైతే చాలు తీవ్రమైన ఎండ, వేడి గాలులకు జనం భయపడి ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితులు అంతటా కనిపిస్తున్నాయి. రేగిడి, సంతకవిటి మండల కేంద్రాల్లో నిత్యం రద్దీగా ఉండే రోడ్లు ఇలా గురువారం నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

– రేగిడి, సంతకవిటి

12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటుకు డిమాండ్



12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి, తమకు రావాల్సిన ఐఆర్, డీఏ బకాయిలు వెంటనే ఇప్పించాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు కోరారు. ఇదే విషయమై బొబ్బిలిలోని ఆ సంఘ కార్యాలయం వద్ద గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసినప్పటికీ నివేదిక ఇవ్వకుండానే చైర్మన్ రాజీనామా చేసినందున కొత్త కమిషన్ ఏర్పాటుకు ఇప్పటి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పటివరకు కమిషన్ ఏర్పాటు జరగనందున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి, వినతిపత్రాలు అందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 17 సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి, పి.లక్ష్మీనారాయణ, కోశాధికారి పి.నాగరాజు తదితరులు బొబ్బిలి పట్టణంలోని వెలమ కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి హాజరుకానున్నారని, సమావేశం అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. గత పీఆర్‌సీలో తగ్గించిన క్వాంటమ్ పెన్షన్‌ను యథాతథంగా పెంచాలని కోరనున్నామన్నారు. అలాగే ఈహెచ్ఎస్ కార్డులపై వైద్యం అందేలా ఆస్పత్రులను ఆదేశించాలన్నారు.

సర్వేలపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి నిర్మలాకుమారి

రాజాం సిటీ: మండలంలో చేపడుతున్న సర్వేలపై మండల ప్రత్యేకాధికారి నిర్మలాకుమారి గురువారం సమీక్ష నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆమె.. హౌసింగ్, సమ్మర్ యాక్షన్‌ప్లాన్, తాగునీరు, ఎస్ఏఎస్ఏ పెండింగ్ సర్వే తదితర వాటిపై సమీక్షించారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. అంతకుముందు సోపేరులోఎల్‌టీసీ ట్రైనింగ్‌లో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు నియోజకవర్గ స్థాయి శిక్షణా కార్యక్రమం చేపట్టారు. సమావేశంలో డీపీఆర్‌సీ కో–ఆర్డినేటర్ పట్నాయక్, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

మండల సర్వసభ్య సమావేశం రేపు

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులంతా హాజరుకావాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

సంతకవిటి: కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీపై రుణం మంజూరు చేయడం జరుగుతోందని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 22వ తేదీ ఆఖరు అని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆటో బోల్తా: పలువురికి గాయాలు

రాజాం సిటీ: మండల పరిధిలోని పెనుబాక సమీపంలో గురువారం ఓ ఆటో బోల్తా పడిన దుర్ఘటనలో అదే గ్రామానికి చెందిన శీర సావిత్రి, బండి హరనాథరావు, బానాన లోకేశ్వరి, మడ్డు పద్మలు గాయాలపాలయ్యారు. వీరంతా రాజాం వచ్చేందుకు గ్రామ జంక్షన్ వద్ద ఆటో ఎక్కారు. కొంత దూరం వెళ్లే సరికి డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆటో బోల్తా పడిందని బాధితులు తెలిపారు. స్థానికులు అప్రమత్తమై వైద్యసేవల నిమిత్తం రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

వంగర: వంగర గ్రామానికి చెందిన 23 ఏళ్ల యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ షేక్‌శంకర్ గురువారం తెలిపారు. ఈ నెల 12న రాజాంలో పరీక్ష రాసేందుకు వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదని, అన్నిచోట్ల వెతికినా ప్రయోజనం లేదని తండ్రి రౌతు కృష్ణ ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com